కలగానే కల్వర్టుల నిర్మాణం


కోనరావుపేట శివారులో వాహనదారులు తిప్పలు


మల్కపేటలో ఒర్రె వద్ద వాహనదారుల ఇబ్బందులు (ఫైల్)

- పలు గ్రామాల్లో ప్రమాదకరంగా ఒర్రెలు
- ఏటా వానాకాలంలో ఇబ్బందిపడుతున్న వాహనదారులు
- ప్రతిపాదనలకే పరిమితమవుతున్న నిర్మాణాలు

కోనరావుపేట: మండలంలోని పలుగ్రామాల మధ్య ఉన్న ఒర్రెలు ప్రమాదకరంగా మారాయి. వానాకాలం వస్తే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ ప్రాంతంలో లో లెవల్ కల్వర్టులు నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపినా అవి కార్యరూపం దాల్చడం లేదు. మండలంలోని మల్కపేట, ధర్మారం, కోనరావుపేట, వట్టిమల్ల, కొండాపూర్ తదితర గ్రామాలకు వెళ్లే దారిలో ఒర్రెలు ఉన్నాయి. ఏటా వర్షాలు కురిసి పొంగిపొర్లుతున్నాయి. దీంతో అన్ని గ్రామాల ప్రజలు, వాహనదారులు రాకపోకలకు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. మలకపేటలో రెండు ఒర్రెలు, ధర్మారంలో ఒకటి ఉన్నాయి. వీటితో పాటు వట్టిమల్లకు వెళ్లే దారిలో ప్రధాన రహదారిపై ఒర్రెలున్నాయి.

ఏళ్లుగా ఇబ్బందులు

మండలంలోని పలుగ్రామాల్లో ఉన్న ఒర్రెలతో మండలప్రజలు కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్నారు. వర్షాకాలంలో పలు గ్రామాల్లోని ఒర్రెలవద్ద నిర్మించతలపెట్టిన లో లెవల్ కల్వర్టుల కోసం మండల ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రతిపాదనలు పంపించారు. ఒక్కో ఒర్రెవద్ద లో లెవల్ కల్వర్టులు నిర్మించేందుకు సుమారు రూ.20 లక్షలపైనే ఖర్చవుతుంది. నిధుల మంజూరు కోసం ప్రతిపాదనలు పంపి ఏడాది దాటుతున్నా ఇప్పటివరకు నిధులు మంజూరు కాలేదు. ఒక్క కోనరావుపే ట మండలకేంద్రంలో కల్వర్టుకు రూ.32 లక్షల నిధులు మంజూరైనా పనులు పూర్తిస్థాయిలో కాలేదు. దీంతో మండలకేంద్రానికి వచ్చే ప్రజలు, సిరిసిల్లకు వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు.

సమస్యలు పరిష్కరించాలి



కోనరావుపేట పెట్రోల్ బంక్‌లో పనిచేస్తున్నా రోజూ వచ్చి వెళ్తుంటాను. ఏటా వర్షాకాలం వచ్చిందంటే ఒర్రెలో నీరు పారడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. వర్షాలు ఎక్కువైతే సిరిసిల్ల–కోనరావుపేట ప్రధాన రహదారిపై రాకపోకలు స్తంభిస్తున్నాయి. అధికారులు స్పందించి రహదారి సమస్యను త్వరగా పరిష్కరించాలి.

–వంగపెల్లి దేవరాజు, కనగర్తి

రాకపోకలకు ఇబ్బంది



వర్షాకాలం వచ్చిందంటే ఆయాగ్రామాల్లోని ఒర్రెలు పొంగిపొర్లుతున్నాయి. దీంతో కోనరావుపేట మండలకేంద్రం నుంచి సిరిసిల్ల వరకు వెళ్లాలంటే ఇబ్బంది తలెత్తుతోంది. ద్విచక్రవాహనదారుల పరిస్థితి మరీ అధ్వానం. వర్షాకాలంలో నీరు పారుతున్న ఒర్రెలపై శాశ్వత ప్రాతిపాదికన వంతెన నిర్మాణం చేపట్టి సమస్య పరిష్కరించేలా చూడాలి.

– గడిపెల్లి ఎల్లయ్య యాదవ్, కోనరావుపేట

నిధులు మంజూరు కాలేదు



కోనరావుపేట మండలంలోని కొండాపూర్ స్టేజీవద్ద ఉన్న ఒర్రె, కోనరావుపేట శివారులో మరో ఒర్రె ఉంది. మిగతా గ్రామాల్లో ప్రధాన రహదారిపై ఉన్న ఒర్రెలపై లో లెవల్ కల్వర్టుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని ఇదివరకే ప్రతిపాదనలు పంపాం. నిధులు మంజూరు అయితే పనులు ప్రారంభించేలా చూస్తాం.

– సతీశ్, ఏఈ, రోడ్లు భవనాల శాఖ

విద్యార్థులు ఉన్నత లక్ష్యంతో చదవాలి


సిరిసిల్ల: పెద్దూరులో పుస్తకాలు, యూనిఫామ్స్ అందజేస్తున్న ఉపాధ్యాయులు


ఎల్లారెడ్డిపేట: విద్యార్థులకు పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీపీ రేణుక

సిరిసిల్ల: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలతో చదువుకోవాలని సిరిసిల్ల 8వ వార్డు కౌన్సిలర్ చెన్నమనేని కీర్తి అన్నారు. సిరిసిల్ల శివారులోని పెద్దూరు ఎంపీహెచ్ఎస్ గురువారం చిన్నారులకు పుస్తకాలు, యూనిఫామ్స్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కీర్తి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ చూపి చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు చక్రవర్తుల రమాదేవి, చెన్నమనేని కమలాకర్‌రావు, ఉపాధ్యాయులు గుండెల్లి రవీందర్, తోట శ్రీనివాస్, వుత్తం విజయ్‌కుమార్, వాణిశ్రీ, కల్పన, గణేశ్, ప్రమీల, మహేశ్, ఏఏపీసీ చైర్‌పర్సన్ తిప్పవరం సుధ స్థానికులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని అల్మాస్‌పూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ఎంపీపీ పిల్లి రేణుక దుస్తులు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అందివచ్చిన అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య అందుతుందన్నారు. ప్రధానోపాధ్యాయులు కుమారస్వామి, నాయకులు శ్రీనివాస్, కిషన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అనుపురంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు ఉచిత నోట్ బుక్‌లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మ్యాకల రవి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదిరులు ఉన్నారు.


వీర్నపల్లిలో పుస్తకాలు అందిస్తున్న అరుణ్ కుమార్

వీర్నపల్లి: మండలకేంద్రంలోని అంబేడ్కర్ నగర్ ఎంపీపీఎస్ పాఠశాలలో ఎంపీటీసీ ఫోరం అధ్యక్షుడు అరుణ్‌కుమార్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు ఉచిత పాఠ్యపుస్తకాలు, నోట్‌బుక్స్, దుస్తులను పంపిణీ చేశారు. ఈ ఆయన మాట్లాడుతూ... ప్రభుత్వ పాఠశాలల్లోనే మెరుగైన విద్య అందుతున్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు వకుళ, ఉపాధ్యాయులు రఘుపతి, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ జోసెఫ్, నరేశ్ అంగన్‌వాడీ టీచర్ వినయకుమారి తదితరులున్నారు.

నియామకం


శ్రీనివాస్‌ను సన్మానిస్తున్న బీడీకార్మిక సంఘం ప్రతినిధులు

సిరిసిల్లటౌన్: జిల్లా బీడీ కార్మిక సంఘం కన్వీనర్, కోకన్వీనరలను బీఎంఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కలాల్ శ్రీనివాస్ గురువారం ప్రకటించారు. కన్వీనర్‌గా నాగుల లావణ్య, కోకన్వీనర్‌గా రేగుల స్వప్నను నియమించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లాకు వచ్చిన శ్రీనివాస్‌ను సంఘం ప్రతినిధులు ఘనంగా సన్మానించారు.

వీధికుక్కల దాడిలో దుప్పిలు మృతి

వీర్నపల్లి: వీధికుక్కల దాడిలో రెండు దుప్పిలు మృతిచెందాయి. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని కంచర్ల గ్రామ పంచాయతీ పరిధిలోని పల్లె ప్రకృతి వనం వద్ద రెండు దుప్పిలను వీధికుక్కలు గాయపర్చాయి. స్థానికులు అల్మాస్‌పూర్ సెక్షన్ అధికారి పద్మలతకు సమాచారం ఇచ్చారు. గాయపడిన రెండు దుప్పిలను వెటర్నరీ డాక్టర్ సాయంతో చికిత్స అందించగా కొద్ది సేపటికే అవి మృతిచెందాయి. పోస్టుమార్టం నిర్వహించి అటవీప్రాంతంలో దహనం చేశారు. కార్యక్రమంలో అటవీశాఖ సిబ్బంది, తదితరులున్నారు.

లక్ష్మీపూర్ శివారులో దారిదోపిడీ?

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి–ఇల్లంతకుంట మండలాల సరిహద్దు లక్ష్మీపూర్ శివారులో గురువారం తెల్లవారుజామున ద్విచక్రవాహనంపై వెళ్తున్న వ్యక్తిని అటకాయించి దారిదోపిడీ చేసినట్లు తెలిసింది. ఇల్లంతకుంట మండలం ఓబులాపూర్ గ్రామానికి చెందిన శ్రీనివాస్ సిరిసిల్లలో కూరగాయలు కొనేందుకు వెళ్తున్నాడు. ఈ క్రమంలో లక్ష్మీపూర్ శివారుకు చేరుకోగానే స్కూటీపై వచ్చిన ముగ్గురు దుండగులు అటకాయించి శ్రీనివాస్ నుంచి రూ.3 వేలు దొంగలించారు. దాంతోపాటు బైక్ తాళంచెవి లాక్కొని పరారయ్యారు. తన కుమారుడికి సమాచారం అందించిన శ్రీనివాస్ ఎక్స్ఎల్ మోపెడ్‌ను ఆటోలో సిరిసిల్లకు తీసుకువచ్చి మరో తాళంచెవి చేయించి స్వగ్రామానికి చేరుకున్నట్లు తెలిసింది. ఈ ఘటనపై ఇల్లంతకుంట, తంగళ్లపల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ముస్తాబాద్: వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చూడాలని ఆవునూర్ ప్రత్యేకాధికారి వెంకటేశ్ కోరారు. మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం గ్రామసభలు నిర్వహించారు. మిషన్ భగీరథ నీటి సరఫరా, వీధిదీపాలు, పారిశుధ్యంపై ఆయాగ్రామాల్లో చర్చించారు.

పదోన్నతుల్లో అవకాశం కల్పించండి


మాట్లాడుతున్న గసికంటి శ్రీనివాస్

బోయినపల్లి(చొప్పదండి): ప్రస్తుతం జరుగుతున్న ఎల్ఎఫ్ఎల్ హెడ్‌మాస్టర్ల పదోన్నతిలో బీఈడీ పూర్తి చేసిన ఉపాధ్యాయులకు అవకాశం కల్పించాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(టీపీయూఎస్) జిల్లా అధ్యక్షుడు గసికంటి శ్రీనివాస్ కోరారు. మండలకేంద్రంలో గురువారం విలేకరులతో మాట్లాడారు. గత శాసనసభలో హామీ ఇచ్చిన మేరకు ప్రాథమిక పాఠశాలలకు ఎల్ఎఫ్ఎల్‌హెచ్ఎం పోస్టులు మంజూరు చేసి, సీనియారిటీ ప్రాతిపదికన అవకాశం కల్పించాలని కోరారు. వొడ్నాల జగన్‌మోహన్, కటకం శ్రీనివాస్, జయకృష్ణ, రవి, ప్రవీణ్, మధుసూదన్‌రావు, శ్రీనివాస్ ఉన్నారు.

బైక్ చోరీ

ముస్తాబాద్: పది నిమిషాల వ్యవధిలో ఓ వ్యక్తి రెండు బైక్‌లను అపహరించాడు. అయితే ఓ బైక్‌లో పెట్రోల్ అయిపోవడంతో దానిని అక్కడే వదిలి మరో బైక్‌పై దర్జాగా పారిపోయాడు. వివరాల్లోకి వెళ్తే.. మండలకేంద్రానికి చెందిన కంతుల బాలయ్య గురువారం తన ఇంటి ముందు బైక్‌ను పార్క్ చేశాడు. మధ్యాహ్న సమయంలో ఇంటిముందు బైక్ కనిపించకపోవడంతో బాలయ్య వెతికాడు. అయితే బాలయ్య ఇంటి ఎదుట గుర్తు తెలియని బైక్ ఉండడంతో దాని యజమాని తెలియక తీసుకెళ్లి ఉంటాడని బాలయ్య భావించాడు. ఇంతలో తన బైక్ పోయిందని దేవరాజు అనే యువకుడు బాలయ్య ఇంటి వద్ద పార్క్‌చేసిన బైక్ తనదేనంటూ తీసుకెళ్లాడు. అయితే దేవరాజు బైక్‌ను కూడా దొంగ ఎత్తుకెళ్లగా బాలయ్య ఇంటి వద్దకు రాగానే బైక్‌లో పెట్రోల్ అయిపోయింది. దేవరాజు బైక్‌ను అక్కడే వదిలి, బాలయ్య ఇంటిముందు పార్క్ చేసిన బైక్‌ను సదరు దొంగ దర్జాగా తీసుకెళ్లాడు. ఈమేరకు బాలయ్య పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు సీసీ పుటేజీని పరిశీలిస్తున్నారు. బైక్ ఎత్తుకెళ్లిన వ్యక్తి హెల్మెట్ ధరించి ఉన్నట్లు గుర్తించారు.

ప్రమాదకరంగా ప్రసాదాల తయారీ కేంద్రం పైకప్పు



వేములవాడ: రాజన్న భక్తులకు ప్రసాదాలు అందించే గోదాం ముందున్న పైకప్పు ప్రమాదకరంగా మారింది. రేకులషెడ్డు రంధ్రాలు పడ్డాయి. ప్రసాదాల తయారీలో పని చేసే సిబ్బంది సేద తీరే ప్రదేశంలోని పైకప్పు ఇలా ఉన్నా అధికారులు పట్టించుకోవడం లేదు.

ఫుడ్‌సేఫ్టీ, టాస్క్‌పోర్స్ పోలీసుల దాడులు


బేకరీని సీజ్ చేస్తున్న అధికారులు

చందుర్తి: మండల కేంద్రంలో ఓ బేకరీలో ఫుడ్ సేఫ్టీ అధికారులు, టాస్క్ పోర్స్ పోలీసులు గురువారం దాడులు నిర్వహించారు. బేకరీలో గడువు ముగిసిన కూల్ డ్రింక్స్, తిను బండరాలను గుర్తించి వాటిని సీజ్ చేశారు. గడువు తీరిన వస్తువులను విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు షాపును జిల్లా ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అనూష , సిబ్బందిని కలిసి దుకాణాన్ని సీజ్ చేశారు. అంతేకాకుండా మండలంలో మల్యాల గ్రామంలో పలు షాపులపై దాడులు నిర్వహించినప్పటికీ ఏమి లభించనట్లు తెలిసింది.

జాబ్ మేళాకు స్పందన



సిరిసిల్ల కల్చరల్: జిల్లా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో గురువారం సిరిసిల్లలో నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించింది. యువతీ యువకులు అధిక సంఖ్యలో హాజరై ఉద్యోగాలు పొందారు. ఈ సందర్భంగా పలువురిని 'సాక్షి' పలకరించగా తమ అభిప్రాయాలు తెలిపారు.

నైపుణ్యాలతో అవకాశాలు పుష్కలం



విద్యార్హతలకు అదనంగా పలు రకాల నైపుణ్యాలను పెంచుకున్న వారికి ఉద్యోగ అవకాశాలకు కొదవ లేదు. కమ్యూనికేషన్, కంప్యూటర్ నాలెడ్జ్‌ను ఎప్పటికప్పుడు మెరుగుపరచుకోవాలి. నైపుణ్యం గల యువత అవసరం కంపెనీలకు ఉంది.

– పుల్లూరి చందర్, హెచ్ఆర్ కోఆర్డినేటర్

సంతోషంగా ఉంది



ప్రైమరీ హెల్త్‌కేర్ సర్వీసెస్ కంపెనీలో ఉద్యోగానికి ఎంపికయ్యాను. నెలకు రూ.35 వేల జీతం వస్తుండడం సంతోషంగా ఉంది. జాబ్ మేళా నిర్వహించిన పోలీసులకు ధన్యవాదాలు.

– బుర్ర కల్యాణి, అడవిపదిర

నెలకు రూ.45వేలతో ఉద్యోగం



బీఎస్సీ నర్సింగ్ పూర్తి చేశా ను. జాబ్‌మేళాకు వచ్చి న వే ల మందిలో నాకు ఉ ద్యోగం రావడం సంతోషంగా ఉంది. నెలకు రూ.45వేల వేతనంతో ఉద్యోగం లభించినందుకు పోలీసులకు రుణపడి ఉంటాను. – మౌనిక, ప్రైమరీ హెల్త్‌కేర్ కంపెనీకి ఎంపికైన సిరిసిల్ల అభ్యర్థి

జాబ్‌మేళాతో యువతకు మేలు



మెగా జాబ్‌మేళాకు హాజరవడం, ఉద్యోగం రావడం మరిచిపోలేనిది. ఎంపవర్‌మెంట్ సర్వీసెస్ కంపెనీలో నెలకు రూ.20వేల వేతనంతో ఉద్యోగానికి ఎంపికయ్యారు. ఇలాంటి జాబ్‌మేళాలతో యువతకు ఎంతో మేలు.

– గడ్డం కీర్తిప్రియ, ఎంపవర్‌మెంట్ సర్వీసెస్

అమెజాన్‌లో ఉద్యోగం నమ్మలేకపోయా



డిగ్రీ అర్హతతో అమెజాన్ కంపెనీలో ఉద్యోగం రావడం నమ్మలేకపోయాను. అపాయింట్‌మెంట్ ఆర్డర్ అందుకునే వరకు టెన్షన్ ఫీలయ్యాను. నెలకు రూ.25వేల వేతనంతో ఉద్యోగం వచ్చింది.

– మచ్చ భావన

జీపీ కార్మికులను ఉద్యోగులుగా గుర్తించాలి


మాట్లాడుతున్న కడారి రాములు

సిరిసిల్లటౌన్: గ్రామ పంచాయతీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి అన్ని అలవెన్సులు అందించాలని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు అన్నారు. గురువారం సిరిసిల్లలోని కార్మిక భవనంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేసి, పనికి సమాన వేతనాలు అందించాలని డిమాండ్ చేశారు. విద్యార్హతల ఆధారంగా ప్రమోషన్లు ఇవ్వాలని, ప్రతినెలా 1న వేతనాలు చెల్లించాలని, పెండింగ్ వేతనాలు అందించాలని కోరారు. నాయకులు అజ్జ వేణు, మీసం లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

పట్టణంలో రోడ్ల విస్తరణ చేపట్టాలి

వేములవాడఅర్బన్: వేములవాడ రాజన్న ఆలయానికి వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివస్తుంటారని, పట్టణంలో రోడ్లు సక్రమంగా లేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు కడారి రాములు అన్నారు. గురువారం వేములవాడ పట్టణంలో ఆయన మాట్లాడారు. పట్టణంలోని రోడ్ల విస్తరణ, డివైడర్ల ఏర్పాటు చేయాలన్నారు. ఇరుకు రోడ్లతో ప్రయాణికులకు ఇబ్బందిగా మారిందన్నారు. గత ప్రభుత్వానికి పట్టణ అభివృద్ధి విషయంపై పలుసార్లు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. కొత్తగా కొలువుదీరిన కాంగ్రెస్ ప్రభుత్వమైనా వేములవాడ పట్టణ అభివృద్ధిపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాస్, దేవయ్య, గణేశ్, నర్సయ్య, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.

వర్షాలు కురిశాకే విత్తనాలు వేయాలి


రైతులతో మాట్లాడుతున్న ఏఈవో శ్రీదేవి

బోయినపల్లి: చిన్నపాటి వర్షాలకే రైతులు తొందరపడి విత్తనాలు వేయొద్దని ఏఈవోలు శ్రీదేవి, రవళి, సాహితీ పేర్కొన్నారు. మండలంలోని స్తంభంపల్లి, బోయినపల్లి, రామన్నపేట, కోరెం, కొత్తపేట గ్రామాల్లో రైతులకు పంటలసాగుపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఈవోలు మాట్లాడుతూ తొలకరి వర్షాలకు భూమి ఉష్ణోగ్రత తగ్గదని, దీంతో విత్తనాలు సరిగా మొలకెత్తవన్నారు. మోస్తరు వర్షం కురిశాకే పత్తి విత్తనాలు విత్తుకోవాలని సూచించారు.

ఫీజు నియంత్రణ చట్టం తేవాలి

సిరిసిల్లటౌన్: రాష్ట్రంలో ఫీజుల నియంత్రణ చట్టం వెంటనే అమలు చేయాలని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర నాయకుడు కంచర్ల రవిగౌడ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గురువారం సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యా సంవత్సరం ప్రారంభమైన నేపథ్యంలో వెంటనే నిబంధనలు అమలు చేయాలని కోరారు. ఇప్పటికే ప్రైవేటు, కార్పొరేట్ యాజమాన్యాలు అధిక ఫీజుల వసూళ్లకు పాల్పడతున్నారన్నారు. నాయకులు మట్టి శ్రీనివాస్, ఓగ్గు అరవింద్, రుద్రవేణి సుదీప్, కోడం వెంకటేశ్, రాపెల్లి భాను, ఎస్‌డీ. ఆసిమ్, నరేశ్, తిరుపతి పాల్గొన్నారు.

నారాయణ స్కూల్‌పై కేసులు పెట్టాలి


నారాయణ స్కూల్‌లో ఆందోళన చేస్తున్న ఏబీవీపీ నేతలు

సిరిసిల్లటౌన్: కార్పొరేట్ పాఠశాల నారాయణ స్కూల్‌పై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఏబీవీపీ రాష్ట్ర హాస్టల్స్ కన్వీనర్ మారవేని రంజిత్ కోరారు. జిల్లా కేంద్రంలోని పాఠశాలలో ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా అధిక ఫీజులు, పుస్తకాలు, డ్రెస్‌లు, అమ్ముతున్నారన్నారు. ఈవిషయాలను విద్యాశాఖ అధికారికి ఫిర్యాదు చేసి సీజ్ చేయించినట్లు పేర్కొన్నారు. పాఠశాలల్లో అధిక, ఫీజులు బుక్స్, డ్రెస్‌లు అమ్ముతున్న యాజమాన్యాలపై చర్యలు తీసుకోకుంటే డీఈవో ఆఫీస్ ముట్టడిస్తామని హెచ్చరించారు. అక్కెం నాగరాజు, లోపెల్లి రాజు, అన్నల్‌దాస్ పవన్‌కుమార్, ఎనగందుల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

ముస్తాబాద్: యువత క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలని సైంటిస్ట్ డాక్టర్ చిగురు ఆదిమలన్ బాబా అన్నారు. మండలంలోని కొండాపూర్‌లో మూడురో జులుగా కొండాపూర్, రామ్‌రెడ్డిపల్లె గ్రామాల యు వకులకు క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించారు. విజేతలకు గురువారం బహుమతులు ప్రదానం చేశారు. టోర్నమెంట్ నిర్వాహకుడు చిగురు వెంకన్న, మాజీ సర్పంచ్ కోరెపు రాజనర్సయ్య, కరుణాకర్, గంత రాజు, అనిల్, నరేశ్, గౌరిసురేశ్, రాజు, శ్రీనివాస్‌రెడ్డి, మహేశ్, పర్శరాములు, నవాబ్, సాయి, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

యువతిని మోసగించిన వ్యక్తిపై కేసు

తంగళ్లపల్లి: ఇల్లంతకుంట మండలం రేపాక గ్రామానికి చెందిన ఓ దళిత యువతిని పెళ్లి చేసుకుంటానని మాయ మాటలతో నమ్మించి మోసం చేసిన వ్యక్తిపై ఎస్సీ ఎస్టీ కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎల్.రాజు తెలిపారు. ఈ మేరకు యువతిని మోసం చేసిన నర్సక్కపేటకు చెందిన కొత్త శ్రీనివాస్ రెడ్డిపై గురువారం కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

క్లుప్తంగా

సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని వినతి


ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం రుద్రవరం గ్రామంలో సబ్‌స్టేషన్ ఏర్పాటు చేయాలని గ్రామస్తులు గురువారం వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను తన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామంలోని 382,383 సర్వే నెంబర్‌లో సబ్‌స్టేషన్‌కు భూమి కేటాయించి మంజూరు చేయించాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పిల్లి కనుకయ్య, గాలిపెల్లి స్వామి, ఉరడి రాంరెడ్డి, వంకాయల భూమయ్య, కత్తి కనుకయ్య తదితరులున్నారు.

17న జిల్లా స్థాయి యోగా పోటీలు

సిరిసిల్లకల్చరల్: అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఈనెల 17న జిల్లా స్థాయి యోగా పోటీలు నిర్వహించనున్నట్లు నిత్య యోగా సాధన, ఆదియోగి యోగా సాధనాలయం నిర్వాహకుడు ఉప్పల శ్రీనివాస్ ప్రకటనలో తెలిపారు. ధనురాసన, వృక్షాసన, పద్మాసన, అర్థ మశ్చేంద్రాసన, ఆకర్ష ధనుష్టాంకారాసన, కుక్కుటాసన, సర్వాంగాసన, నటరాజాసన మొదలైన ఆసనాల్లో పోటీలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. విద్యానగర్‌లోని శ్రీచైతన్య హైస్కూల్‌లో జరిగే పోటీలకు ఆసక్తి గల వారు హాజరుకావాలని కోరారు. వివరాలకు 70139 50299 నంబర్‌కు వాట్సప్‌లో వివరాలు పంపించాలని తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

తంగళ్లపల్లి: మండలంలోని మండెపల్లి మోడల్ స్కూల్‌లో రెండు ఉపాధ్యాయ పోస్టులు ఖాళీలు ఉన్నాయని, అర్హులైన అభ్యర్థులు దరఖాస్తులు చేసుకోవాలని గురువారం ప్రిన్సిపాల్ మేడిపల్లి రమేశ్ ఒక ప్రకటనలో తెలిపారు. పీజీటీ తెలుగు, పీజీటీ ఇంగ్లీష్ ఒక్కో పోస్టులు ఖాళీలు ఉన్నాయన్నారు. ఎంఏ తెలుగు బీఈడీ, ఎంఏ ఇంగ్లిష్ బీఈడీ అర్హత కలిగిన వారు ఈనెల 19న ఉదయం 10:30 గంటలకు తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో మోడల్ స్కూల్‌లో డెమోకు హాజరుకావాలని కోరారు.

అంగన్‌వాడీ బడి బాట


గొల్లపల్లిలో బడిబాటలో పాల్గొన్న అంగన్‌వాడీ టీచర్లు, చిన్నారులు

కోనరావుపేట: మండలంలోని గొల్లపల్లి (వట్టిమల్ల)లో గురువారం అంగన్‌వాడీ బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలోని చిన్నారులు, విద్యార్థులు ర్యాలీతీశారు. చిన్నారులను అంగన్‌వాడీలో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. కార్యక్రమంలో మాజీసర్పంచ్ గోపు పర్శయ్య, ప్రధానోపాధ్యాయుడు రవీందర్, అంగన్‌వాడీ టీచర్ భుక్య శీల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీజేపీ మండల అధ్యక్షుడి రాజీనామా

తంగళ్లపల్లి: ఇల్లంతకంట బీజేపీ మండల అధ్యక్షుడు కొత్త శ్రీనివాస్ రెడ్డి గురువారం పార్టీ మండల అధ్యక్ష పదవికి రాజీనామా చేశారు. ఈమేరకు రాజీనామా లేఖను జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణకు పంపగా ఆయన అంగీకరించారు. వ్యక్తిగత కారణాతోనే రాజీనామా చేసినట్లు శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు.

ఆలయ వార్షికోత్సవం


పూజలు చేస్తున్న గాంధీబాబు

గంభీరావుపేట: మండలంలోని గోరింటాలలో సాయిబాబా ఆలయ వార్షికోత్సవ వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. సాయిబాబాకు పంచామృతాలతో అభిషేకం చేసి ప్రత్యేక పూజలు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు కొండూరు గాంధీబాబు పూజలు నిర్వహించారు.

బక్రీద్‌కు ఏర్పాట్ల పరిశీలన

ఎల్లారెడ్డిపేట: మండలకేంద్రంలో ఈనెల 17న జరిగే బక్రీద్ వేడుకల కోసం ఈద్గాలోని దర్గాలో ఏర్పాట్లను గురువారం ప్రత్యేకాధికారి సత్తయ్య, నాయకులు పరిశీలించారు. ఈ సందర్భంగా సత్తయ్య మాట్లాడుతూ.. రెండ్రోజుల్లో చెట్లు తొలగించి పరిసరాలను శుభ్రంగా ఉంచాలని పంచాయతీ సిబ్బందిని కోరారు. దర్గాలో ముస్లింలు పండుగ రోజు ప్రత్యేక ప్రార్థనలు చేసుకునేందుకు వీలుగా అన్ని వసతులు కల్పించాలన్నారు. మాజీ ఎంపీటీసీ ఒగ్గు బాల్‌రాజ్ యాదవ్, కార్యదర్శి దేవరాజు, మైనార్టీ నాయకులు దర్వేశ్, లాల్ మహమ్మద్, గౌస్, ఖాజా, శానిటరీ ఇన్‌చార్జి ఆంజనేయులు పాల్గొన్నారు.